

కూటమి అండ.. దోపిడీ 'కొండ'!

తిరుపతి జిల్లా, వడమాలపేట మండలం, తిరుమండ్యం గ్రామంలో మైనింగ్ మాఫియా చెలరేగిపోతోంది. - 8లో



మఠం భూములు.. హాంఫట్!

తిరుపతి రూరల్ మండల పరిధిలోని హథీరాంజీ మఠం భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నారు. - 8లో



ఆగని దాడులు

చంద్రగిరి నియోజకవర్గంలో ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టిస్తోంది. చేతికొచ్చిన పంటలను తొక్కి నాశనం చేస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ నిరవధిక సమ్మె



నిరసన తెలుపుతున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్

తిరుపతి తుడా: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సంయుక్తంగా ఆందోళన బాట పట్టారు. మేడేని పురస్కరించుకుని గురువారం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే నుంచి తాము శాంతియుతంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఎమ్‌ఎల్‌హెచ్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత రెండేళ్ల జీతాభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఆరేళ్లు దాటిన ప్రతి ఉద్యోగిని క్రమబద్ధీకరించాలని, 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి ఏడాది ఇంక్రిమెంట్ 5 శాతం పెంచాలని, ప్రతినెలా వేతనంతో పాటు ఇన్సెంటీవ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుమంత్, అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ తనిఖీ



లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీలో గురువారం ఉదయం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షితో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. పలువురు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఒకటవ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,230 మంది లబ్ధిదారులకు సుమారు రూ.111.84 కోట్ల మేర పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, తహసీల్దార్ సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు, సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందరావు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల గుడిసెల తొలగింపు



ఓటేరులో గుడిసెలను తొలగిస్తున్న అధికారులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, ఓటేరు పంచాయతీలో నిరుపేదల గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు తొలగించారు. పద్మావతీపురం లెక్కదాఖలా సర్వే నం.246లో ఓటేరు పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని అనధికారికంగా వేసుకున్న గుడిసెలను గురువారం బలవంతంగా తొలగించారు. భూ ఆక్రమణదారులు కోట్ల రూపాయల విలువైన భూముల్లో శాశ్వత కట్టడాలు కడుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదలపై తమ ప్రతాపం చూపడం దారుణమని పలువురు విమర్శలు ఎక్కుపెట్టారు. వెంటనే తకు ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు.

తిరుపతి శ్రీనివాస బస్టాండ్ వద్ద బస్సులు లేక పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



అమరావతి.. పోతోంది మతి!

ఎంకి పెళ్లి సుబ్బిగాడి చావుకొచ్చినట్టుగా మారింది అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం. నేడు జరగనున్న ప్రధాని పర్యటనకు యంత్రాంగం భారీ ఎత్తున జనసమీకరణ చేపట్టింది. అమరావతికి రాకుంటే సంక్షేమ పథకాలు రావని హెచ్చరికలు జారీచేయడంతో డ్వాక్రా మహిళలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. మొదలే ఎండలు.. ఆపై ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్న తరుణంలో అమరావతికి వెళ్లిరావడం చావుకు ఎదురెళ్లడమే అవుతోంది. మధ్యలో జరగరానిదేమైనా జరిగితే ఎవరు బాధ్యులో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి భారీ ఎత్తున బస్సులు కేటాయించడంతో ప్రయాణికులు నరకం అనుభవించాల్సి వస్తోంది. 'అమరావతీ.. పోతోంది మతి' అంటూ జనం చర్చించుకోవడం కనిపించింది.

- ప్రధాని అమరావతి పర్యటనకు భారీగా జనసమీకరణ
- 145 ఆర్టీసీ, మరో 20 ప్రైవేటు బస్సుల ఏర్పాటు
- ప్రతి బస్సుకు 50 మంది చొప్పున ఎక్కాల్సిందే
- ఒక్కో మహిళకు రూ.500, రెండు రోజులు భోజన వసతి
- ప్రతి డ్వాక్రా సంఘం నుంచి సభ్యులు రావాల్సిందే
- లేకుంటే సంక్షేమ పథకాలు రావని హెచ్చరికలు
- కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, డ్వామా పీడీ, ఏడీలకు బాధ్యతలు
- ఎండ వేడిమికి బస్సులు లేక ప్రయాణికుల తిప్పలు



స్కూటరెక్కైనా సీటు సంపాదించాల్సిందే

సాక్షి ప్రతినిధి, తిరుపతి: అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున జనసమీకరణ చేపట్టింది. నేడు ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్న ఈ కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి జనాలను తరలించేందుకు సిద్ధమైంది. జనాలను తీసుకెళ్లి తీసుకొచ్చే బాధ్యతలను ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి అప్పగించింది. తిరుపతి, చిత్తూరు జిల్లా నుంచి జనాలను తరలించేందుకు 145 ఆర్టీసీ, మరో 20 ప్రైవేటు బస్సులను కేటాయించింది. ఒక్కో బస్సుకు 50 మంది చొప్పున 8,250 మందిని తరలించాలని అంచనా. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 10 నుంచి 12 బస్సులు కేటాయించినట్లు సమాచారం.

అమరావతికి వస్తే దుర్గమ్మ దర్శనం ఫ్రీ!

పట్టణాల్లో డ్వాక్రా సభ్యులు అమరావతికి వస్తే కనకదుర్గమ్మ దర్శనం చేయిస్తామని చెప్పినట్లు తిరుపతి నగరంలో ప్రచారం జరుగుతోంది. అమరావతి సభకు వచ్చే ప్రతి ఒక్కరికీ రూ.500 ఇస్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు చెబుతున్నారు. అదేవిధంగా గురువారం రాత్రి నుంచి శనివారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకునే వరకు వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

బస.. ఏందీ గోస?

తిరుపతి, చిత్తూరు నుంచి వెళ్లే వారికి ఒంగోలులో గురువారం రాత్రికి ఓ ప్రైవేటు కళాశాలలో బస ఏర్పాటు చేశారు. వీరంతా శుక్రవారం ఉదయం టిఫిన్ అయ్యాక నేరుగా అమరావతికి చేరుకుంటారు. ఒక్కో బస్సుకు 120 ఆహార పొట్లాలు, వందకుపైగా అరటి పండ్లు, 120 వాటర్ బాటిళ్లు, 60 ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా కిచిడీ, చట్నీతో పాటు ఒక ఆరెంజ్ పండు అందించనున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ఏర్పాట్లన్నీ పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు సమాచారం. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మార్గ మధ్యంలో ఆరోగ్య కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. తిరుపతి, చిత్తూరు నుంచి బయలుదేరిన వారంతా శుక్రవారం 12 గంటలకు అమరావతి సభకు చేరుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం.

డ్వాక్రా సభ్యులు రాకపోతే సంక్షేమ పథకాలు కట్!



అమరావతిలో నిర్వహించే కార్యక్రమానికి ఎక్కువ శాతం డ్వాక్రా మహిళలను తరలించారు. ఆయా గ్రామాల్లో ఉండే సంఘ మిత్రకు బాధ్యలు అప్పగించారు. ఆమె డ్వాక్రా లీడర్లను పురమాయించారు. ప్రతి గ్రూపు లీడర్లు తప్పని సరి. గ్రూపులోని సభ్యులు రాకపోతే వారికి సంక్షేమ పథకాలు అందవని లీడర్లు, వెలుగు సిబ్బంది చేత హెచ్చరికలు జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

అధికారులందరికీ బాధ్యతలు



జిల్లాల నుంచి జనాలను తీసుకెళ్లి తీసుకొచ్చే బాధ్యతలను ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగించారు. ప్రతి నియోజక వర్గానికి ఆర్డీఓ లేదంటే కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్, డ్వామా పీడీ, మార్కెటింగ్ శాఖ ఏడీకి బాధ్యతలు అప్పగించారు. కిందిస్థాయి అధికారులు కొందరిని అమరావతిలో భోజన వసతి ఏర్పాట్లు చూసుకోమని బాధ్యతలు అప్పగించినట్లు అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి కాకుండా కూటమి నేతలు నాయకులకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు.

బస్సులు లేక అవస్థలు



అస్సో..బస్సో: బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు

అమరావతి పునర్నిర్మాణానికి ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా తంటాలు ఎదుర్కొంటున్నారు. బస్సులు అమరావతి కార్యక్రమానికి తరలించిన విషయం తెలియక అనేక మంది ప్రయాణికులు తిరుపతి, చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్లలో పడిగాపులు కాస్తున్నారు. వచ్చిన ఒకటీ అర బస్సుల్లో ప్రయాణించేందుకు జనం పోటీపడుతున్నారు. ఫలితంగా తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. బస్సుల్లో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఆర్టీసీ బస్సులు అమరావతి కార్యక్రమానికి కేటాయించటంతో శుక్ర, శనివారాలు కూడా తిప్పలు తప్పవని ఆవేదన చెందుతున్నారు.

అంగన్‌వాడిపోతున్నారు



ఎండలు మండుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు భగభగా మండిపోతున్నాడు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో చిన్నపిల్లలు, వృద్ధులు ఎండబారిన పడకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సైతం సూచిస్తున్నారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు గత నెల 24వ తేదీ నుంచి సెలవులు ప్రకటించింది. పీజీ కళాశాలలకు సైతం సెలవులు ఇచ్చింది. కానీ నోరులేని చిన్నపిల్లలు ఉంటున్న అంగన్‌వాడీ పాఠశాలలను మాత్రం యథావిధిగా నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాలలు నడపాలని పేర్కొనడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. మొదలే అరకొర సౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని నిలదీస్తున్నారు. వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని యూనియన్ నాయకురాళ్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఐసీడీఎస్ పీడీ వసంతబాయి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశిలిస్తే అలానే ఇస్తామని చెప్పారు. మే 1 నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ వర్కర్‌కు మే 16 నుంచి 31వ తేదీ వరకు హెల్పర్‌కు సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. – **తిరుపతి అర్బన్**

సారా రహిత జిల్లాగా తిరుపతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: సారా రహిత జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న తిరుపతి జిల్లాలో చేపట్టిన 2.0 అమలు పురోగతిపై ఆయన ఆరాతీశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ 2.0 లక్ష్యం మేరకు జిల్లాను సారా రహిత జిల్లాగా మార్పు చేశామని వెల్లడించారు. జిల్లాలో చంద్రగిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం నియోజకవర్గాల పరిధిలోని 17 మండలాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 18 గ్రామాల్లో 153 మంది పాత నేరస్తులపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు రవి మనోహరాచారి, వాసుదేవచౌదరి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో తిరుపతి జిల్లా ఫస్ట్

తిరుపతి అర్బన్: పింఛన్ల పంపిణీలో తిరుపతి జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఏప్రిల్ నెలకు సంబంధించి 2,61230 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. గురువారం జిల్లా వ్యాప్తంగా మొదటి రోజే 95.23 శాతం మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారికి శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయాల్లో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

బలవంతపు సర్వేను అడ్డుకుంటాం!



కొల్లడం వద్ద భూ సర్వేను అడ్డుకుని ధర్నా చేస్తున్న రైతులు

సత్యవేడు: బలంతపు సర్వేలను అడ్డుకుంటామని మండలంలోని కొల్లడం, ఇరుగుళం రైతులు తేల్చిచెప్పారు. మండలంలో ఏపీఐఐసీ ప్రత్యేక ఆర్థిక మండలి రెండవ విడత భూసేకరణలో భాగంగా ఎల్‌జీ కంపెనీ కోసం ప్రారంభించిన భూసర్వేను కొల్లడం వద్ద గురువారం రైతులు అడ్డుకున్నారు. రెండో విడత భూసేకరణ కోసం నోటిఫైడ్ భూములను సర్వే చేసేందుకు తిరుపతి జిల్లా సర్వేయర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో డివిజన్‌నల్ సర్వేయర్ ప్రసాద్‌రావు, మండల సర్వేయర్లు 20 మంది కలసి సర్వే చేపట్టేందుకు కొల్లడం వచ్చారు. తమ అనుమతి లేకుండా బలవంతపు సర్వేలు చేపట్టేందుకు అంగీకరించమని రైతులు స్పష్టం చేశారు. ఆపై సర్వే బృందానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. దీంతో జిల్లా సర్వేయర్ రాచపాళెం –సత్యవేడు మెయిన్ రోడ్డు నుంచి వెళ్లిపోగా.. కొల్లడం వచ్చిన సర్వే బృందాన్ని వెనక్కు తిప్పి పంపారు. రాచపాళెం వద్ద సర్వేయర్లందరూ ఉన్నారన్న సమాచారంతో రైతులు అక్కడికి చేరుకుని మరో మారు ధర్నా చేపట్టారు. సత్యవేడు– శ్రీకాళహస్తి మార్గంలో గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ధర్నాలో కొందరు మహిళలు పెట్రోలు పోసుకొనేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అక్కడి చేరుకొన్న శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, సత్యవేడు తహసీల్దారు రాజశేఖర్ రైతులతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రైతులు కే.విజయశంకర్‌రెడ్డి, కేవీ.నిరంజన్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కాశీప్రతాప్‌రెడ్డి, మురళీ నాయుడు, బీడీఎస్ రెడ్డి, ఆర్.శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు మరమ్మతులు

తిరుపతి అర్బన్: శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాలకు మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేశామని, వెంటనే పనులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో హాస్టల్స్ వార్డెన్స్‌తోపాటు ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పాఠశాలలు తిరిగి ప్రారంభించే సమయానికి మరమ్మతు పనులు పూర్తికావాలన్నారు. సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు మహాత్మా జ్యోతీరావు పూలే, బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. అధనంగా అవసరమైన నిధులు సీఎస్ఆర్, ఎంపీ లాడ్స్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ద్వారా సమీకరించుకోవాలని చెప్పారు. సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రంకుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రాజేంద్రరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజాసోము, జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి బాలాజీనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మా, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



మృతి చెందిన ముదులమ్మ (ఫైల్)

వరదయ్యపాళెం: వడదెబ్బతో ఉపాధి కూలీ ముదులమ్మ (64) మృతిచెందిన ఘటన మండలంలోని కంచరపాళెంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం.. ముదులమ్మ రోజువారీ ఉపాధి పనులకు వెళ్తోంది. గురువారం యథావిధిగా ఉపాధి పనులకు వెళ్లి పనులు చేస్తుండగా మధ్యాహ్నం ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది. చికిత్స నిమిత్తం ఆమెను శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొఫెసర్ బదిలీ

తిరుపతి తుడా: శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల పరిధిలోని చిన్న పిల్లల ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ తిరుపతిరెడ్డిని ప్రభుత్వం గురువారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి ఆయన్ను ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ చేశారు. సాధారణ బదిలీ లేకపోయినా ప్రత్యేక జీఓ ద్వారా ఆయన్ను బదిలీ చేయడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 66,616 మంది స్వామివారిని దర్శించుకోగా 27,837 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.



క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన మునిరత్నం (ఫైల్)

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్రపాకం చెరువులో గురువారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం బయటపడింది. అది తవణంపల్లికి చెందిన మునిరత్నం (40)దిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడా.. మద్యం మత్తులో పడ్డాడా..? కుటుంబ కలహాలతో తనే ఆత్మహత్య చేసుకున్నాడా..? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మునిరత్నం చెరువు కట్టమీద ఉన్న ఓ బండపై కూర్చుని అతిగా మద్యం సేవించి ఇంటికి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

తిరుమలలో తనిఖీలు


తనిఖీ నిర్వహిస్తున్న అదనపు ఈఓ

తిరుమల: శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న కొబ్బరికాయల విక్రయకేంద్రం, టీటీడీ ప్రచురణల విక్రయ కేంద్రం, డాలర్ల విక్రయ కేంద్రాలను గురువారం ఉదయం టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. ముందుగా అఖిలాండం వద్ద ఉన్న కొబ్బరి కాయలు విక్రయ కేంద్రంలో తనిఖీలు చేసి కొబ్బరి కాయల సైజును పరిశీలించారు. అనంతరం టీటీడీ ప్రచురణల విక్రయ కేంద్రానికి చేరుకున్న ఆయన అక్కడ స్టాక్‌ను పరిశీలించారు. టీటీడీ డాలర్ల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి


మృతి చెందిన బట్టా నవీన్ (ఫైల్)

చిట్టమూరు: మండల పరిధిలోని పల్లంపర్తి గ్రామంలో గురువారం సరదాగా ఈతకు వెళ్లి బట్టా నవీన్(20) అనే యువకుడు మృతిచెందాడు. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన బట్టా మస్తానయ్య, రాజేశ్వరి దంతుల కుమారుడు బట్టా నవీన్. ఇంటర్మీడియెట్ వరకు చదివి శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. మేడే సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉండగా.. మధ్యాహ్నం తన స్నేహితుడితో కలసి గ్రామం పక్కనే ఉన్న గుంటలో ఈత కొట్టేందుకు బురదలో కూరుకుపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో.. గ్రామస్తులు అతి కష్టం మీద నవీన్ మృతదేహాన్ని బయటకు తీశారు. చేతికొచ్చిన కొడుకు దూరమవ్వడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం కలచివేసింది.

కూటమి అండ.. దోపిడీ కొండ!



అనుమతి గోరంత.. తవ్వేది అంతా..! అన్నట్టుగా తయారైంది వడమాలపేట మండలంలో మైనింగ్ లీజు పరిస్థితి. తిరుమండ్యం గ్రామంలో 7.5 ఎకరాలకు అనుమతి తీసుకుని దాదాపు పది ఎకరాలకుపైగా తవ్వేసినా ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న దృశ్యం

- కోట్ల విలువ చేసే రాతి సంపద దోపిడీ
- కూటమి అండతో విచ్చలవిడిగా రవాణా
- తిరుమండ్యం కొండలో అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న మైనింగ్ అధికారులు
- భారీ పేలుళ్లతో బీటలు వారిన నివాసాలు
- దుమ్ము ధూళితో దిగుబడి తగ్గుతోందంటున్న రైతన్నలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, తిరుమండ్యం గ్రామంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. అనుమతికి మించి కొండను పిండి చేస్తూ విలువైన రాతి సంపదను కొల్లగొడుతోంది. తిరుమండ్యం గ్రామ లెక్కదాఖలాలో సర్వే నం.175లో సుమారు 116 ఎకరాల గుట్ట పోరంబోకు ఉండగా.. అందులో 2.96 హెక్టార్లు (సుమారు 7.5 ఎకరాలు) మైనింగ్ నిమిత్తం లీజుకు తీసుకున్నారు. కొండను తవ్వి నెలకు సుమారు 45 వేల టన్నుల వరకు తరలిస్తున్నారు. ఇప్పటికే వారికి ఇచ్చిన పరిధిని దాటేశారు. దాదాపు 10 ఎకరాల మేరకు విస్తరించి తవ్వకాలు జరుపుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. క్వారీదారుకు అధికార పార్టీ నేతల అండ ఉండడంతో మైనింగ్ శాఖ అధికారులు మొక్కుబడి తనిఖీలు, నోటీసులతో సరిపెట్టేస్తున్నారు. 'మేము తనిఖీలు చేస్తుంటాం.. మీరు తరలిస్తూ ఉండండి' అన్నచందంగా పరస్పర ఒప్పందంతో ఈ దందా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక లోడ్డుకు బిల్లు చూపి.. పది లోడ్ల కంకర అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

తవ్వేసి..మింగేసి!

లీజు తీసుకున్నవారికి పదేళ్లవరకు కంకర తరలింపుకు అనుమతి ఉంటుంది. కేటాయించిన విస్తీర్ణములో మాత్రమే రాళ్లను తవ్వి తరలించాలి. అలా తరలించే రాళ్లకు క్వారీదారు టన్నుకు రూ.150 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. అదే టన్నుకు బయట రూ.2,100 నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. నెలకు 45 వేల టన్నుల రాళ్లను తరలిస్తుండగా అందులో 20 నుంచి 30 శాతానికి మాత్రమే రూ.150 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో కోట్ల రూపాయల సొమ్ము క్వారీదారు జేబుకు చేరుతోంది. అందులో అధికార పార్టీ నేతలు వాటాలు పంచుకుంటున్నట్టు సమాచారం.

పడగవిప్పుతున్న పర్యావరణ కాలుష్యం

ఒకవైపు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంటే మరోవైపు సమీప గ్రామస్తులను పర్యావరణ కాలుష్యం గుదిబండగా మారింది. ఈ క్వారీకి 200 మీటర్ల దూరంలో దివంగత మహానేత వైఎస్సార్ ప్రభుత్వంలో పేదలకు నిర్మించిన 25 నివాసాలు ఉన్నాయి. క్వారీలో రాళ్లను పేల్చడానికి వాడాల్సిన నమోదుకంటే ఎక్కువ నమోదులో పేలుడు పదార్థాలు వాడడంతో ఆ ప్రకంపనలకు సమీప ప్రాంతాలు కంపించిపోతున్నాయి. ఇప్పటికే 20 ఇళ్లు బీటలు వారిపోయాయి. రాత్రి పూట కంటిపై కనుకు లేకుండా పోతోందని స్థానిక భయాందోళన చెందుతున్నారు. క్వారీకి చుట్టుపక్కల సుమారు 300 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. రైతులు మామిడి, వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. ఆ పంటలపై క్వారీ నుంచి వచ్చే దుమ్ము ధూళి పడడంతో దిగుబడి తగ్గిపోతోంది. సుమారు 20 ఎకరాలలో దిగుబడి దారుణంగా పడిపోయింది. అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట దిగుబడి రావడం లేదు



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. అందులో ఒక ఎకర మామిడి తోట వేసుకోగా, మిగిలిన భూమిలో వరి సాగు చేసుకొని జీవనం సాగించేవాడ్ని. క్వారీ నుంచి వచ్చే దుమ్ము ధూళి పంటలపై పడి దిగుబడి చాలావరకు తగ్గిపోయింది. మామిడి చెట్లకు పూత రావడం లేదు. వచ్చే పూత కూడా రాలిపోతోంది. నష్టాలపాలవుతున్నాను. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.
–ధనంజయులురెడ్డి, తిరుమండ్యం


బీటలు బారిన ఇంటి గోడలు

ఇళ్లు పగుళ్లుబారుతున్నాయి



"గతంలో ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్నాను. కొండపై క్వారీకి అనుమతి ఇచ్చాక పెద్ద ఎత్తున పేలుళ్లు చేస్తున్నారు. అక్కడి నుంచి ఇళ్లు ఉండే ప్రాంతం వరకు అదురుతోంది. నివాసాలు పగుళ్లబారుతున్నాయి. నా ఇంటికి కూడా పగుళ్లు వచ్చాయి. దాదాపు అన్ని ఇళ్లకు పగుళ్లు ఉన్నాయి.
– జయమ్మ, తిరుమండ్యం.

సాగు చేయడం మానుకున్నా



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వరి, నువ్వులు, వేరుశనగ సాగు చేస్తుంటాను. ఇటీవల క్వారీ నుంచి వచ్చే దుమ్ముధూళి పంటపై పడడంతో సాగుచేయడం మానుకున్నాను.
– గురుప్రసాద్, తిరుమండ్యం

తనిఖీ నిర్వహిస్తాం

క్వారీకి ఇచ్చిన విస్తీర్ణం కన్నా ఎక్కువగా కొండను తొలిచేస్తున్నారా..? అనే అంశంపై మైనింగ్ వారికి తెలియజేసి తనిఖీ నిర్వహిస్తాం. ఎక్కువ విస్తీర్ణంలో కొండను తొలిచినట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. మోతాదుకు మించి పేలుళ్లు జరిపితే కఠిన చర్యలు తప్పవు.
–జరీనా, తహసీల్దార్, వడమాలపేట


తిరుమండ్యం గుట్టలో క్వారీ తవ్వకాలు


ఏర్పడిన భారీ గోతులు


బండరాళ్లను పగులగొడుతున్న యంత్రం

4న ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) అధ్యక్షుడు బీ.విజయ్‌కుమార్, కార్యదర్శి ఎస్.రవికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా అండర్–19 బాలురు, అండర్–23 పురుషులు, అండర్–15 బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అండర్–19కు 01-09-2006, అండర్–23కు 01-09-2002 తరువాత జన్మించిన వారు, అండర్–15కు 01-09-2010 తరువాత 31-08-2012లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రికెట్ కిట్, ఆధారు కార్డు, బర్త్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సీడీసీఏ కోచ్ జీ.సునీల్‌కుమార్‌ను 90002 14966, సీడీసీఏ అసోసియేట్ సంయుక్త కార్యదర్శి ఎం.సతీష్‌యాదవ్‌ను 88861 85559 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఎంపిక పోటీలు ఇక్కడే

చిత్తూరు, మదనపల్లి డివిజన్ల పరిధిలో వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో ఉదయం 9గంటలకు అండర్–19(బాలురు), అండర్15(బాలికలు), మధ్యాహ్నం 2గంటలకు అండర్–23(పురుషులు), తిరుపతి డివిజన్‌కు సంబంధించి తిరుపతి, మంగళం రోడ్డులోని సీవీ క్రికెట్ అకాడమీలో ఉదయం 9 గంటలకు అండర్–19(బాలురు), అండర్15(బాలికలు), మధ్యాహ్నం 2గంటలకు అండర్–23(పురుషులు)జట్లు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆగని దాడులు


వరి పంటను నాశనం చేసిన ఏనుగుల గుంపు

పాకాల: ఏనుగుల గుంపు గజగజలాడిస్తోంది. రాత్రి పూట అటవీ సరిహద్దు గ్రామాలపై పడి పంటలను సర్వనాశనం చేస్తోంది. ఇలాంటిదే మండలంలోని గానుగపెంట గ్రామం, చినపాపయ్యగారిపల్లిలో చోటు చేసుకుంది. బుధవారం రాత్రి గానుగపెంట గ్రామానికి చెందిన యతీశ్వర్‌రెడ్డి వరి పంటను ధ్వంసం చేసింది. సుమారు లక్ష వరకు పంట నష్టం వాటిల్లింది. అలాగే మోహన్‌రెడ్డికి చెందిన ఎకరా వరి పంటను నాశనం చేయగా.. రూ.30 వేల పంట నష్టం వాటిల్లింది. మరో 20 మంది రైతుల పొలాలకు వేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసింది. చినపాపయ్యగారిపల్లిలో శివయ్యకు చెందిన మామిడి చెట్లు, పైపులైన్లను ధ్వంసం చేశాయి. సుమారు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి యూజీ, పీజీకి దరఖాస్తులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో యూజీ (శాస్త్రి), పీజీ (ఆచార్య) కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. నాన్ ఎన్‌యూఈటీ (నేషనల్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్) కింద వర్సిటీలో యూజీ, పీజీ కోర్సుల్లో 40శాతం సీట్ల భర్తీ కోసం ఆసక్తిగల అభ్యర్థులు శనివారం నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఎస్ఎస్‌యూ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎన్‌యూఈటీ ప్రవేశ పరీక్ష ద్వారా వర్సిటీలో 60శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 40శాతం సీట్ల భర్తీ కోసం రెండవ విడత కౌన్సెలింగ్ ద్వారా నేరుగా వర్సిటీ ఆధ్వర్యంలో యూజీ, పీజీ ప్రవేశాలను చేపట్టనున్నారు.

అధ్యాపకులకు అదనపు బాధ్యతలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో 2025–26వ విద్యా సంవత్సరానికి సంబంధించి పలువురు అధ్యాపకులకు కీలక పదవులు అప్పగించారు. ఈమేరకు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో బాయ్స్ హాస్టల్ వార్డెన్‌గా డాక్టర్ బి.రాంబాబునాయక్, బాలికల హాస్టల్ వార్డెన్‌గా డాక్టర్ ఆరే లక్ష్మీకవిత, ఓఎస్ఏగా డాక్టర్ వినోద్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.సుధీర్ నియమితులయ్యారు. అలాగే యూజీ, పీజీ అకడమిక్ అడ్వైజర్స్‌గా డాక్టర్ ఆర్.వేణు, డాక్టర్ జి.గంగరాజును, బాయ్స్, బాలికల హాస్టల్ అడిషనల్ వార్డెన్లుగా డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రవంతి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లుగా చైతన్యకుమార్, శ్వేతక్రాంతి, తేజ, శ్వేతని నియమించారు.

మఠం భూములు.. హాంఫట్!

- బరితెగించిన కబ్జాదారులు
- మాయమవుతున్న మఠం భూములు
- గాంధీపురంలో రూ.4 కోట్ల విలువైన మఠం భూమి కబ్జా
- భూ మాఫియాకు భయపడుతున్న మఠం అధికారులు
- ఆక్రమణల తొలగింపునకు సహకరించని రెవెన్యూ, పోలీసు శాఖలు
- అధికార పార్టీ అండతో చెలరేగుతున్న ఆక్రమణదారులు


గాంధీపురం పంచాయతీ పరిధిలోని సర్వే నం.13లో అక్రమంగా సాగుతున్న నిర్మాణాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి శివారు ప్రాంతాల్లోని హథీరాంజీ మఠం భూములు కబ్జాదారుల చేతుల్లో పడి మాయమై పోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలోనే ఖాళీగా ఉన్న మఠం భూములు, వివాదాస్పద భూములను గుర్తించిన తెలుగు తమ్ముళ్లు వాటిపై గద్దల్లా వాలిపోతున్నారు. బలహీనులైన పేదల నుంచి బలవంతంగా లాక్కుంటున్నారు. పేదలను భయపెట్టి అనధికారిక పత్రాల్లో సంతకాలు చేయించుకుని కొట్టేస్తున్నారు. విలువైన భూములు కాజేస్తున్నా మఠం అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

తిరుపతి రూరల్ మండలం, అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నం.13లోని మఠం భూమిని అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు కబ్జాచేసినట్టు సమాచారం. ఆన్‌లైన్‌లో ఆ మొత్తం భూమి మఠం భూమిగా ఉంది. ఇందులో ఎవరికీ ఎలాంటి హక్కు లేదు. ఎందుకంటే శ్రీవారిపై భక్తితో భక్తులు కానుకగా అందజేసిన భూములు అవి. కానీ కబ్జా రాయుళ్లు పట్టపగలు అడ్డగోలుగా కట్టడాలు కడుతున్నారు. బోర్లు వేసి పక్కాగా కట్టడాలు నిర్మిస్తున్నారు. కబ్జాదారులు ఆక్రమించిన ప్రదేశంలో ఒక అంకణం విలువ సుమారు రూ.2 లక్షలు పలుకుతోందని సమాచారం. ఆ లెక్కన 200 అంకణాల వరకు ఆక్రమించిన భూమి విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

మఠం అధికారులు స్పందించరెందుకో?

వేల కోట్ల విలువైన మఠం భూములను కాపాడడంలో హథీరాంజీ మఠం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్టు గాంధీపురం వాసులు ఆరోపిస్తున్నారు. ఆక్రమిత మఠం భూముల్లో అనధికారిక నిర్మాణాలను రెవెన్యూ, పోలీసు అధికారులు తొలగించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ బాధ్యత తీసుకుని కోట్ల విలువైన మఠం భూములను కాపాడడంతో పాటు నిరుపేదలకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు. మఠం భూముల్లో యథేచ్ఛగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు, భూ ఆక్రమణలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వరుసగా భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపాలని సూచిస్తున్నారు.

మఠం భూములు మటుమాయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కబ్జాదారులు మఠం భూములపై తమ ప్రతాపం చూపుతున్నారు. ఇప్పటికే కొంతమంది కబ్జారాయుళ్లు మఠం భూములపై నకిలీ పత్రాలు సృష్టించుకుని న్యాయస్థానాల్లో కేసులు వేసి పోరాడం చేస్తుండగా.. మరికొంత మంది అధికారాన్ని అడ్డుపెట్టుకుని మఠం భూముల్లో అక్రమ కట్టడాలు కడుతున్నట్టు సమాచారం. తరతరాలుగా మఠం భూములను సాగుచేసుకుని తమ ఆధీనంలో పెట్టుకున్న వారిపట్ల కబ్జాదారులు విరుచుకుపడుతుండడంతో అటువైపు వెళ్లలేక, అక్రమ కట్టడాలను ఆపలేక లోలోపల కుమిలిపోతున్నారు. పోలీసులు, మఠం అధికారులు, రెవెన్యూ అధికారులు ఎవ్వరికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకుండిపోవాల్సి వస్తోందని గాంధీపురం వాసులు గగ్గోలు పెడుతున్నారు.

మాకు సహకరిస్తే ఆక్రమణలు తొలగిస్తాం

హథీరాంజీ మఠం భూములను రక్షించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. మేం అక్కడకు వెళితే కబ్జాదారులు మాపైకి మారణాయుధాలతో దాడులు చేస్తున్నారు. గతంలో పలుమార్లు మాపై దాడులు జరిగాయి. అందుకే మఠం భూముల్లో ఆక్రమణల తొలగింపునకు స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సర్వే నంబరు 13తో పాటు ఆ చుట్టు పక్కల 175 ఎకరాల భూమి మఠానికి చెందినదే. అక్కడ ఎవ్వరికీ ఎలాంటి హక్కూ లేదు. రెవెన్యూ అధికారులు, పోలీసులు సహకరిస్తే అక్కడి ఆక్రమణలను తొలగించేస్తాం.
–శేషవులు, సూపరింటెండెంట్,
హథీరాంజీ మఠం కార్యాలయం

ఇష్టారాజ్యం


అరణియార్ నదిలో జేసీబీతో ఇసుక తవ్వకాలు

నాగలాపురం: మండలంలో ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ద్వారకానగర్ వద్ద అరణియార్ నదిలో అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నారు. అధికార పార్టీ అండతో జేసీబీ యంత్రాలు పెట్టి మరీ ఇసుక లోడేస్తున్నారు. గత మూడు రోజులుగా ఈ దందా సాగుతున్నా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సీఐపై చర్యలు తీసుకోవాలని వినతి


మీడియాతో మాట్లాడుతున్న పూసలవీధికి చెందిన మహిళలు

రేణిగుంట: శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి తమ పట్ల అమానుషంగా వ్యవహరించారని, ఆయనపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణంలోని పూసల వీధి వాసులు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తికి ఫిర్యాదు చేశారు. వివరాలు.. శ్రీకాళహస్తి పట్టణం, 18వ వార్డు, పూసల వీధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ ఖాదర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి కేక్ కత్తిరించి స్నేహితులతో కలసి ఎలాంటి ఆర్భాటం లేకుండా పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. అయితే సీఐ గోపి సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని, కేక్ కటింగ్‌కి అనుమతులు లేవని చెప్పి అక్కడున్న యువకులను పంపించేశారు. జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న షేక్ ఖాదర్ వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి అని టీడీపీ నాయకులు చెప్పడంతో మళ్లీ పూసల వీధికి చేరుకుని తమపై సీఐ జులుం ప్రదర్శించారని బాధితులు ఆరోపించారు. అక్కడ ఉన్న షేక్ ఖాదర్, అతని స్నేహితులను విచక్షణరహితంగా కొట్టి, నానా దుర్భాషలాడారన్నారు. గంజాయి కేసులు పెట్టి జైల్లో వేస్తానని హెచ్చరించారన్నారు. బీడీ పని చేసుకునే మీకెందుకు ఇలాంటివంటూ అవహేళనగా మాట్లాడినట్టు వాపోయారు. ఈ మేరకు విచారిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చినట్టు బాధితులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థిని

గూడూరు రూరల్: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు గూడూరు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని దీపిక ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలక్ష్మి తెలిపారు. ఇటీవల శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం, తుమ్మలపెంట బీచ్ వద్ద జరిగిన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు మే 3 నుంచి 6వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి 12వ అంతర జిల్లాల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థినికి మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారం అందించనున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట టౌన్: అశోక్ నగర్ వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో కాలువలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, లైట్ బ్లూ కలర్ షార్ట్, తెలుపు బ్లూ కలర్ చారలు ఉన్న టీషర్టు ధరించినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహం ఉబ్బిపోయి ముఖం గుర్తుపట్టలేనంతగా ఉంది. గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే సీఐ బాబీని 94407 96357 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కిశోరి బాలికా వికాసం పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

తిరుపతి అర్బన్: కిశోరి బాలికా వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో పాటు కిశోరి బాలిక వికాసం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులు చేయాలని వెల్లడించారు. సమర్థవంతంగా అమలయ్యేలా అన్ని శాఖలు పని చేయాలన్నారు. మే 2 నుంచి జూన్ 10 వరకు వివిధ అంశాలపైన మహిళా పోలీస్, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ తదితరులు పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి వసంత బాయి, సీడీపీఓ శివశంకర్, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

LEASE/ RENT
Godowns/Storage Space Available
Syntific WareHouses / Godowns of 27000 Sft., (13500+13500)
Readily available for rent.
Near International Airport at Renigunta.
Intrested Business Houses/ Individuals can approach.
COMMERCIAL MANAGER
PCR WAREHOUSING LTD.

స్మార్ట్ సిటీ తిరుపతి ప్రతి ఏరియాలో ఓపెన్‌ప్లాట్స్ పేరూరు తుమ్మలగుంట బైపాస్ కమర్షియల్ ప్లాట్స్, ఇల్లులు, విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ల్యాండ్స్ లీజ్‌కివ్వబడును&అమ్మబడును.7997461827

Wanted

ప్రముఖ కంపెనీలో టీం లీడర్‌గా తిరుపతి, చిత్తూరు జిల్లాలో పని చేయుటకు (స్త్రీ/పు) కావలెను. అర్హత, ఇంటర్ ఆపైన. సెల్: 9440351657

మా ఆఫీస్‌లో పనిచేయుటకు ఇంటర్ చదివిన లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం: 9K-18K ఇది కన్సల్టెన్సీ కాదు. సంప్రదించండి సెల్: 98486 25575.

Gurappa Parameswara Electrical & Civil Works, Tirupati Walk - In - Hiring - Accountant Must have a Degree in Accounting (or) Finance at least 5 Years of Work Experience Should know how to use Accounting Software must Understand GST & Taxes. Cell: 9133309137, Email: gurappaparameswara@gmail.com

Sri Padmavathy Logistics M/s Asian Paints Ltd, Next to RPR Kalyanmandapam, Padma vathi Nagar, Tukivakam Village & Post, 939444 7222, 63008 43436, Wanted Computer Operator, Min.Exp. 2 Yrs, Wanted Helpers, 17,000 (Including ESCI, EPF)

Wanted Security Field Officer from Gudur and know the industries can call us . CASS, Nellore, CellNo. 99510 72170.

Wanted Female Telecallers for Banking Process Qlf: Any Degree. Salary: 12 to 15K+ (incentives) R.C. Road,Tirupati.Contact: 90528 48668.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డ్రైవర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక